క్లుప్తంగా

మలికిపురంలో స్వచ్ఛతా హి సేవ

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి ఆదేశాలపై శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏపీ ఎన్‌జీసీ రాజోలు క్లస్టర్ కో ఆర్డినేటర్ జీ.ప్రభావతి నిర్వహించారు. వచ్చే నెల 2వ తేదీ వరకూ వివిధ పాఠశాలల్లో నిర్వహించాల్సి ఎస్‌హెచ్‌ఎస్ కార్యక్రమాల్లో భాగంగా మలికిపురంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మలికిపురం ఉన్నత పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పనులను విద్యార్థులతో కలపి ఆమె చేపట్టారు. అలాగే మొక్కలను కూడా ఆమె, పాఠశాల హెచ్‌ఎం పి.శ్రీనివాసరాజుతో కలిపి నాటారు.

గోదావరి మాతకు పున్నమి హారతి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో ఉన్న గౌతమీ గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. శోభకృత్ నామ సంవత్సర భాద్రపద శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహిళ భక్త బంద సభ్యులు శాస్త్రోక్తంగా పున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గోదావరి మాతకు పున్నమి హారతిని ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

రావులపాలెం: గ్రామానికి చెందిన బుర్లే రమ్యశ్రీ మహాలక్ష్మి ఇంజినీరింగ్ ఫస్టియర్ చదువుతుంది. పేదరికంతో ఇబ్బంది పడుతున్న ఈమెకు చదువుకు అవసరమైన ల్యాప్‌టాప్‌ను స్థానిక పులవర్తి ఎడ్యుకేషనల్ ట్రస్టు అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణమూర్తి శుక్రవారం బహూకరించారు. రూ.40 వేలు విలువైన ఈ ల్యాప్‌టాప్‌ను విద్యార్థికి అందించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మహాజన సభ

మలికిపురం: స్థానిక పీఏసీఎస్‌లో శుక్రవారం మహాజన సభ సంఘ చైర్‌పర్సన్ చెల్లుబోయిన బుచ్చియ్య అధ్యక్షతన జరిగింది. అజెండా ప్రకారం సీఈవో ప్రవేశపెట్టిన తీర్మానాలను చర్చించి, ఆమోదించారు. అలాగే సొసైటీకి కొత్త భవనం నిర్మాణానికి ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వం గ్రాంటు రప్పించుకోవాలని తీర్మానించారు. రైతు నేస్తం ద్వారా ఎకరాకు రూ.8,00,000 వరకూ రైతులకు ఇచ్చేందుకు స్థానిక డీసీసీబీ సుముఖంగా ఉందని సమావేశం తెలిపింది. స్థానిక సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ గుబ్బల బాబ్జి, విశ్వేశ్వరాయపురం సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, ఎంపీటీసీ గౌరీ వెంకట పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్డు ఏర్పాటుకు చర్యలు

అంబాజీపేట: రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను తరలించేందుకు అనువుగా అంతర్గత రోడ్ల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు అధ్యక్షతన కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేలా సీఎం జగన్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న స్థలాల అభివృద్ధికి, నిర్మాణాలపై దృష్టి సారిస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ, సభ్యులు కోట విజయరాజు, బాలబాలాజీ, శ్రీలక్ష్మి, కాశీ అన్నపూర్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రై డే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీ శంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అంబాజీపేట: పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో అథ్లెటిక్స్ అండర్–14, –17 బాల బాలికలకు జిల్లా స్థాయి ఎంపికకు పోటీలను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. బాలబాలికలకు రన్నింగ్ 200, 400, 800, 1500, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్‌పుట్, డిస్కస్ త్రో విభాగాల్లో పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. సుమారు 220 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు పోటీ నిర్వాహకులు తెలిపారు. ఈ జిల్లా స్థాయి ఎంపిక పీడీల పర్యవేక్షణలో నిర్వహించారు.

డిగ్రీ కళాశాలకు బీప్లస్ న్యాక్ గ్రేడ్

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) బెంగళూరు నుంచి బీ ప్లస్ గ్రేడ్‌తో ర్యాంకు ప్రకటించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.జ్యోతి శుక్రవారం తెలిపారు. 2.67 పాయింట్లతో వచ్చిన ఈ గ్రేడ్ ఐదు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందన్నారు. (అనగా 29-9 -2028 తేదీ వరకు) కళాశాలలో ఉన్న వివిధ వసతులు విద్యా ప్రమాణాలు, విద్యార్థుల కరిక్యులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్, ఇతర అనేక రకాలుగా అన్ని డిపార్ట్‌మెంట్లను పరిశీలించి ఈ గ్రేడును న్యాక్ కమిటీ ఇచ్చిందన్నారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు.. ఆరోగ్య నిలయాలు

- నేడు సోంపల్లిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం
- గ్రామ స్థాయిలో మెరుగైన వైద్య సదుపాయాలు


సోంపల్లిలో ప్రారంభానికి సిద్ధమైన హెల్త్ వెల్‌నెస్ సెంటర్

రాజోలు: ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు గ్రామస్థాయిలోనే అన్ని సదుపాయాలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను నిర్మిస్తుంది. చిన్నపాటి అనారోగ్యానికి, వైద్య సమస్యలకు కిలోమీటర్ల దూరంలో ఉన్న సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు వెళ్లనవసరం లేకుండా గ్రామంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లోనే వైద్య సేవలు పొందే విధంగా అన్ని సదుపాయాలు కల్పించారు. గ్రామాల్లో ఉండే వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఈ సెంటర్ల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 432 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే రాజోలు నియోజకవర్గంలో సుమారు 40 వెల్‌నెస్ సెంటర్ల పనులు ప్రారంభించారు. వీటిలో తొలిదశలో తాటిపాక గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. సోంపల్లిలో నూతనంగా నిర్మాణం చేసిన భవనాన్ని ఈనెల 30న ఎమ్మెల్యే రాపాక ప్రారంభిస్తారని సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు తెలిపారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటరులోని సదుపాయాలు

సుమారు 2 వేల నుంచి మూడు వేలు జనాభా కలిగిన ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ ఉంటుంది. సెంటర్ 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ), గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. అలాగే సుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అత్యాధునిక కిట్లు ఏర్పాటు చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు భవనాలు పూర్తికాని చోట్ల గ్రామ సచివాలయల్లో, అద్దె భవనాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వృద్ధులు, గర్భిణులకు నిరంతరం వైద్యబృందం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చు. సెంటర్‌కు వచ్చే రోగులను ఎంఎల్‌హెచ్‌పీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్యసూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఈ సెంటర్ పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ప్రభుత్వం నియమించి వైద్యులు 104 వాహనం ద్వారా వచ్చి వైద్యసేవలు అందిస్తారు. హెల్త్‌వెల్ నెస్ సెంటర్ పరిధిలో ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులకు, పక్షవాతం, ఇతర రోగాలతో మంచానికి పరిమితమై కేంద్రాల వద్దకు రాలేని పరిస్థితిలో ఉన్న రోగులను పరీక్షించేందుకు వారి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు.

గ్రామాల్లోనే ప్రాథమిక వైద్యం



హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా గ్రామంలోనే ప్రాథమిక వైద్యాన్ని పొందవచ్చు. ఈ సెంటర్లలో 24 గంటలు ఉండేందుకు సీహెచ్‌ఓ ఈ భవనంలోనే నివాసం ఉంటారు. రోగుల కోసం 105 రకాల మందులు అందుబాటులో ఉంచడమే కాకుండా 14 రకాల వైద్యపరీక్షలు చేస్తారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలకు గ్రామంలోనే వైద్యం పొందవచ్చు.

– సీహెచ్ ఫణికిరణ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, తాటిపాక

గ్రామంలోనే హెల్త్ వెల్‌నెస్ సెంటర్



గ్రామ ప్రభుత్వాస్పత్రిగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిలుస్తుంది. భవనం నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేశాం. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. మా ఊరుకి రెండు కిలోమీటర్ల దూరంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఉన్నాయి. రోగులు, వృద్ధులు, గర్భిణులు ఎలాంటి కష్టం పడకుండా గ్రామంలోనే హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ నిర్మించారు.

– కట్టా శ్రీనివాసరావు, సర్పంచ్, సోంపల్లి

యువకుడి మృతి బాధాకరం


మడికిలో మృతుడు రాకేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని మడికిలో గణనాథుడి నిమజ్జనం సందర్భంగా తూర్పు డెల్టా ప్రధాన కాలువలో గల్లంతై మృతి చెందిన అత్తిలి రాకేష్ (22) మృతి బాధాకరమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక ఏరియాలోని మృతుని నివాసానికి విచ్చేసి రాకేష్ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాకేష్ తల్లిదండ్రులకు రూ.30 వేల ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఉండ్రాసపు సుందరం విజయం, సుంకర కామరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో ముందడుగు


తాటిపాక మఠం ప్రాంతంలో మహిళకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పాలన అందిస్తూ ముందడుగు వేస్తుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం తాటిపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక పాల్గొన్నారు. తాటిపాక మఠం, ఏటిగట్టు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రాపాక వివరించారు. ఏటిగట్టు వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే రాపాకకు పలు చోట్ల మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హత ఉన్న వారందరికీ మంజూరు చేస్తున్నామన్నారు. ఎలాంటి వివక్షత చూపకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డినే మళ్లీ సీఎంగా విజయపథంలో నిలపాలని కోరారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పరిపాలనలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని దానిలో భాగంగానే సచివాలయ, వలంటీరు వ్యవస్థలను తీసుకుని వచ్చారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీటీసీలు కట్టా మోహన్‌కృష్ణ, చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, గుబ్బల మనోహర్, మెడబల రాజ్‌కుమార్, కడలి లక్ష్మి, బొంతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వినియోగించుకోవాలి


అంబాజీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట/పి.గన్నవరం/సఖినేటిపల్లిలమూరు/కొత్తపేట: అందరికీ సంపూర్ణ ఆరోగ్య భాగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగి రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి రోగి సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష సచివాలయ ఉద్యోగులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, అధికారులు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా అధునాతన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. శనివారం అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించే మెగా క్యాంపునకు అందరూ హాజరై విజయవతం చేయాలన్నారు. పి.గన్నవరంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం మండల స్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

సఖినేటిపల్లి: స్థానిక గీతామందిరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాట్లును ఎంపీడీవో జీ.భీమారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పావని శుక్రవారం పరిశీలించారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష జరిగింది. కొత్తపేటలో స్థానిక న్యూ అండ్ బ్యాంక్ కాలనీ ప్రాంతంలో జరిగిన సురక్ష సర్వేలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్ వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

ముక్తేశ్వరంలో 'నా మట్టి–నా దేశం'


ముక్తేశ్వరం సెంటర్‌లో 'నా మట్టి–నా దేశం' కార్యక్రమం

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జయంతి రామయ్య పంతులు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్'లో భాగంగా శుక్రవారం 'నా మట్టి–నా దేశం' కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో అమృత కలశం పట్టుకుని ముక్తేశ్వరం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ముక్తేశ్వరం సెంటర్లో ప్రభాత భేరి నిర్వహించారు. పలువురితో కలశంలోకి మట్టిని వేయించారు. అనంతరం పంచప్రాణ ప్రతిజ్ఞ విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.గణేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులలో మాతృభూమిపై, దేశంపై గౌరవాన్ని కలిగి దేశరక్షణ, పురోగతికి అందరూ నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.కనకరాజు, ఆర్.భాస్కరరావు, జి.సాయిశ్రీనివాస్ ఎస్ఎం గ్రేస్, ఎం.రమేష్, డి.శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: ప్రతి విద్యార్థి దేశభక్తి భావం అలవర్చుకోవాలని, దేశ నాయకుల జీవిత చరిత్ర తెలుసుకోవాలని ఎంఈఓ వరప్రసాద్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల వద్ద నా మట్టి.. నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల వద్ద ఎంఈఓ వర ప్రసాద్ విద్యార్థులకు పలు సూచనలిచ్చి ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీవీఎస్ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీకి ఘన సత్కారం


ఆలమూరులో ఈఓపీఆర్డీ సుబ్బారావును సత్కరిస్తున్న గ్రామ కార్యదర్శుల సమాఖ్య

ఆలమూరు: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పదోన్నతుల్లో ఈఓపీఆర్డీగా నియమితులైన డి.సుబ్బారావును మండల కార్యదర్శుల సమాఖ్య శుక్రవారం ఘనంగా సత్కరించింది. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కొత్తపేట ఈఓపీఆర్డీగా బాధ్యతలు స్వీకరించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనకు దుశ్శాలువా కప్పి పూలమాలలు వేసి మెమెంటోతో సత్కరించారు. వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు


గోపాలపురంలో అవిడి ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట/రావులపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి తిరుమల–తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవాణి ట్రస్ట్ నిధులు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. కొత్తపేట మండలం అవిడి పెద్ద చెరువుగట్టు వద్ద సీతారామాలయం అభివృద్ధి విషయాన్ని ఇటీవల స్థానిక పెద్దలు వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దానిపై ఆయన స్పందించి తగిన ప్రతిపాదనలు తయారు చేయాలని స్థానిక దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించి, వాటిని ప్రభుత్వ దేవదాయ శాఖ అధికారులకు సమర్పించారు. ఆ మేరకు టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. దానిలో మొదటి విడతగా రూ.3 లక్షలు విడుదల కాగా శుక్రవారం రావులపాలెం మండలం గోపాలపురంలో ఆ చెక్కును అవిడి పెద్దచెరువు గట్టు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇదే విధంగా 44 దేవాలయాలకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. నిధులు మంజూరుకు తక్షణ చర్యలు తీసుకుని, నిధులు విడుదల చేయించిన జగ్గిరెడ్డికి గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అవిడి పీఏసీఎస్ పర్సన్ పరమట సూర్యప్రకాశరావు, దేవస్థానం ఈఓ బి.వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పరమట నాగేశ్వరరావు, సత్తిబాబు, మోడేకుర్రు వైఎస్సార్ సీపీ నాయకుడు కుడుపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కవి భీమారావుకు గాంధీ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు


కవి జినిపే భీమారావు

కొత్తపేట: స్థానిక ప్రముఖ కవి, శ్రీశ్రీ కళావేదిక సోషల్ యాక్టివిస్ట్ మెంబర్ జినిపే భీమారావు విజయవాడకు చెందిన ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి మహాత్మా గాంధీ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆ మేరకు ఆ సంస్థ ప్రెసిడెంట్ అద్దంకి రాజయోనా సమాచారం పంపినట్టు భీమారావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. సాహితీ రంగం నుంచి తనను ఎంపిక చేసినట్టు తెలిపారు. వచ్చే నెల 2న గాంధీ జయంతి సందర్భంగా విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో అవార్డులు ప్రదానం జరుగుతుందని భీమారావు తెలిపారు. జాతీయ అవార్డు అందుకోనున్న కవి భీమారావును శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కొత్తపేట కళాసాహితీ అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవళరాజు, ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు, సభ్యుడు షేక్ గౌస్ అభినందించారు.

అన్నసమారాధన

కొత్తపేట: స్థానిక పొట్టి శ్రీరాములు వీధి గణపతి నవరాత్రి ఉత్సవ పందిరిలో శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్నసమారాధనలు నిర్వహించడం ఆనవాయితీ. దానిలో భాగంగా పొట్టి శ్రీరాములు వీధిలోని వరసిద్ధి వినాయక ఉత్సవ పందిరిలో భారీ ఎత్తున కార్యక్రమం నిర్వహించగా కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు కోసూరి సత్తిబాబు, శ్రీకాకోళ్లపు చిన్ని, వానపల్లి సుబ్బారావు, పాలూరి జయప్రకాష్‌నారాయణ, బొడ్డు సుబ్రహ్మణ్యం, సుగంధం ప్రసాద్, నల్లా బాబి, శ్రీకాకోళ్లపు శ్రీనివాస్ తదితర పెద్దలు, యువకులు, పలువురు మహిళా సంఘం సభ్యులు అన్నసమారాధన సేవల్లో పాల్గొన్నారు.

అయినవిల్లిలో భారీ అన్నదానం

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి సీతారామాలయం రావిచెట్టు వద్ద గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు.

ర్యాలిలో అన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి రాజోలుకు చెందిన గంటి సూర్యనారాయణ మూర్తి రూ.10,500 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు స్వామి చిత్రపటం అందజేశారు.

జీపీఎస్ ప్రతుల దహనం

మామిడికుదురు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద శుక్రవారం రాత్రి జీపీఎస్ ప్రతులను దహనం చేశారు. సీపీఎస్‌ను తక్షణం రద్దు చేయాలని, జీపీఎస్ అమలును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో అడబాల వెంకట శ్యామలావతి, అప్పన కొండయ్య, కడలి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో, కబడ్డీ పోటీలు ప్రారంభం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ స్కూల్‌లో శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో బాలురకు ఏర్పాటు చేసిన ఖోఖో, కబడ్డీ పోటీలను ఎంపీపీ వీరా మల్లిబాబు ప్రారంభించారు. ఎంఈవో–1 డి.కిషోర్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆర్.చిన రాజా, ఎంపీటీసీ ఆర్.వెంకట్రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి


అంబాజీపేట సొసైటీలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యమోహన్

అంబాజీపేట: యాంత్రీకరణ పద్ధతుల ద్వారా సాగు చేపట్టాలని అందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్‌పర్సన్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట సొసైటీ కార్యాలయంలో మహాజన సమావేశం చైర్‌పర్సన్ సత్యమోహన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంపీపీ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు సత్యమోహన్‌లు మాట్లాడుతూ రైతుల సహకారంతోనే సొసైటీ లాభాల్లో పయనిస్తుందన్నారు. సొసైటీలో రుణాలు తీసుకున్న వారు సకాలంలో రుణాలు చెల్లించేలా బాధ్యతలు తీసుకోవాలన్నారు. కస్టమ్స్ హైరింగ్ సెంటర్ ద్వారా రైతులు గ్రూపులుగా ఏర్పడితే ప్రభుత్వ సబ్సిడీ రుణాలు పొందవచ్చన్నారు. సొసైటీ సీఈఓ కుంపట్ల అయ్యప్ప నాయుడు మాట్లాడుతూ సొసైటీ బడ్జెట్, ఇతర అంశాలను చదివి వినిపించారు. సమావేశంలో సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, పితాని మంగాదేవి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, పీకే రావు, నందెపు సూరిబాబు, వాకపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఎన్‌హెచ్‌ఎం నిధుల మంజూరు


అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ మట్టపర్తి నాగవిజయలక్ష్మి

అయినవిల్లి: స్థానిక పీహెచ్‌కి నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ద్వారా నిధులు రూ.9.82 లక్షలు మంజూరైనట్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం అయినవిల్లి పీహెచ్‌సీ వద్ద ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ప్రస్తుతం అయినవిలి పీహెచ్‌సీలో వార్డులో ఆరు బెడ్లు ఉన్నాయని పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవి తెలిపారు. మరో వార్డు, ఆరు బెడ్ల అవసరం ఉందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మంజూరైన నిధులు వార్డు నిర్మాణానికి వినియోగిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ఈ నెల 30 నుంచి జరగబోయే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చర్చించింది. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటచార్య, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అగ్నికుల క్షత్రియుల నూతన కార్యవర్గం ఎన్నిక

పి.గన్నవరం: అగ్నికుల క్షత్రియులంతా సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శేరు శ్రీనుబాబు, పెమ్మాడి మారుతీకృష్ణమోహన్ అన్నారు. పోతవరంలోని పినపోతు వీర్రాజు కాంప్లెక్స్‌లో శుక్రవారం జరిగిన మండల సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. మండల సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అగ్నికుల క్షత్రియ సేవా సంఘ గౌరవాధ్యక్షుడిగా ఆరధాని ఏడుకొండలు, అధ్యక్షుడిగా కొల్లు రాంబాబు, కార్యదర్శిగా శేరు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా కొపనాతి సీతారామస్వామి, సభ్యులుగా కొల్లాటి వెంకట్రావు, లంకే చిరంజీవి, పాలెపు సత్యనారాయణ, పొన్నమండ రాముడు, కొల్లు గంగాద్రి, కొప్పాడి పెద్దిరాజు, వైదాడి లోహిదాసు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని నాయకులు అభినందించారు.